

వయస్వీ. రమణారావు

# కళ్ళు

"అరేవిటీ శుక్రవారం దాకా రానని చెప్పి వెళ్ళారు."

బుధవారం మధ్యాహ్నంకే వచ్చేసిన భర్తని ఆశ్చర్యంగా అడిగింది అరుణ.

"విరహం భరించలేక" నవ్వుతూ దగ్గిరకు తీసుకున్నాడు సుందరం.

"ఏవిటీ ఇంత వేడిగా వుందీ. బయట ఎండ ఎక్కువగా వుంది కాబోలను కుంటున్నాను...ఇది మీ విరహప్రతాపమన్నమాట" నవ్వుతూ తప్పించుకో బోయింది.

"మహా వాళ్ళు చూడు ఎలా కాలి పోతోందో."

"చల్లటి నీళ్ళున్నాయి, హాయిగా పోసుకురండి భోంచేద్దురుగాని."

ఆ మాటల్లో సరికొత్త అందం... ఆ మొహంలో వింతయిన మెరుపు కనపడ్డాయి సుందరానికి. అరుణ చాలా

అందమైంది ఆ అందానికి ఈ ఎరుపులూ, మెరుపులూ తోడయితే రెండు కళ్లూ చాలవు చూడ్డానికి.

"ఏవిటో అమ్మాయిగారు ఈ రోజు చాలా హుషారుగా వున్నారు! ఏవిటి సంగతీ?"

"తమరు స్నానంచేసి రండిసార్... తీరిగ్గా భోజనందగ్గిర కబుర్లాడుకోవచ్చు."

"ఆల్‌రైట్—అలాగే కానియ్యండి."

* * *

భోంచేస్తున్న సుందరాని కెదురుగ్గా కూర్చుంది కరుణ

"ఏవండీ మీరెప్పుడయినా అజంతా శిల్పాల్ని చూసారా?"

హఠాత్తుగా అడిగిన ఈ ప్రశ్నకి ఆశ్చర్యపోయి కరుణ మొహంలోకి చూసాడు సుందరం ... చాలా నిశ్చలంగా వుంది!

"చూడకేం. రెండుసార్లు చూసాను", అన్నాడు సమాధానంగా.

"ఆ శిల్పాలు అతి మనోహరంగా వుంటాయిట కదూ?"

"అవును...చూసినకొద్దీ చూడాలనిపిస్తుంది."

"అంత అందమైన రాతిబొమ్మలకు ప్రాణంవస్తే."

"వస్తుందా...నీ పిచ్చిగాని."

"ఒకవేళ వస్తే."

"వస్తే కదులుతున్న ఆ అందాల్ని చూడ్డానికి ఎన్ని కళ్ళు చాల్తాయి?"

"పచ్చటి వెన్నెల్లో బృందావనాన్ని చూసారా?"

ఇవన్నీ ఎందుకడుగుతూందో సుందరానికి అర్థంకాలేదు.

"ఏవిటీవాళ్ళ పిచ్చి పిచ్చి ప్రశ్నలేస్తున్నావు కరుణా?" లాలనగా అడిగాడు.

"అడ్డు ప్రశ్నలెయ్యక నేనడిగిందానికి జవాబు చెప్పండి."

"చూసాను."

"అంత వెన్నెల తనమీద కురుస్తోంటే బృందావనం వెర్రెత్తిపోతుంది కదూ."

"నిజంగా పరవశించి పోతున్నట్టుంటుంది."

"అంత పరవశించే ఆ అందమైన తోటకి భగవంతుడు తియ్యటి కంఠం ఇవ్వగలిగితే మధురమైన పాట వినిపించగలుగుతుంది కదూ."

"ఎంత చక్కటి ఊహ! ఎంత మధురమైన భావన" తనూ పరవశించి పోయాడు.

"నేను చాలా అందంగా వుంటానంటుంటారు కదూ మీరు."

"నేనడ వేమిటి కరుణా - ప్రపంచంలోవున్న అందమంతా నీలోనే పోగుపోసుకుంది ... నువ్విప్పుడన్నావే అజంతా శిల్పాలు... వెన్నెల్లో బృందా

వనం - వీటన్నిటికంటే చాలా అందమయినదానివి నువ్వు", ఆవేశంగా అన్నాడు సుందరం.

"అందమయిన అజంతా శిల్పాలకి ప్రాణంపోయడం కష్టం - వెన్నెల్లో పరవశించే బృందావనానికి తియ్యటి కంఠం రావడం కష్టం ... కాని ఆ రెండింటి కన్నా అందంగా వుంటానంటున్నారే ఈ అందమైన గుడ్డిదానికి కళ్ళు రాగలిగితే..." ఆపేసింది కరుణ. సుందరం మొహంలో గంటుపడింది! ఆ గంటుతో ఆ మొహం మరింత వికృతమయింది!

"మళ్ళీ మొదలెట్టావు ... ఆ పాత పాటే వద్దన్నాను", అన్నాడు చిరాగ్గా కంచంలో చెయ్యికడుక్కుంటూ.

"పాత పాటకాదు. కొత్తమాట! చాలా తియ్యటిమాట! ఇంత మధురమైన ఆశ కల్పించేదెవరో చెబితే మీరు ఆశ్చర్యపోతారు", సుందరం మొహంలో చిరాకు-వికారం ఏమాత్రం గ్రహించలేని కరుణ నవ్వుతూ అంది.

"ఏ కొండవాడేనా మళ్ళీ జోస్యం చెప్పాడా?"

"జోస్యంవేం కాదు. నిఖార్సయిన డాక్టరు నిక్కచ్చిగా చెప్పినమాట!"

"అయితే నేనిలా ఊరు కెళ్తున్నప్పుడల్లా నువ్విలా డాక్టర్ల దగ్గిర కెళ్తున్నావన్నమాట."

"ఏ డాక్టరు దగ్గిరకో వెళ్లాల్సిన ఖర్మ నాకెందుకూ, మీ స్నేహితుడే మంచి డాక్టరయితే."

సుందరానికి అసలేం అర్థంకావటం లేదు. ఈ గొడవేం కొత్తగాదు కాని కరుణలో ఎప్పుడూ లేని ఉత్సాహం - తనకి కళ్ళువచ్చి తీరతాయన్న అచంచలమైన విశ్వాసం! మునుపటికన్నా వెయ్యిరెట్లు అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తోంది! ఈ అందమంతా ఎప్పుడూ తనదే కావాలి. చీకట్లోనే ఆ కళ్ళు తన కోసం వెతుక్కోవాలి! పరితపించాలి! అవి వెలుగులోకి రాకూడదు! వెలుగులో కొస్తే ఈ ప్రపంచం ఆమెకన్నా చాలా అందమైనది, విశాలమయినదీను!

"మా ఫ్రెండా? డాక్టరా?" అన్నాడు, సాలోచనగా.

"ఆ! మీ ఫ్రెండే. అంత మంచి డాక్టరు మీ స్నేహితుకన్న విషయం ఈ రెండేళ్ళలోనూ మీరెప్పుడూ చెప్పలేదెందుచేత? చెబితే రాయవేలూరు వెళ్దామని గోలచేస్తాననేగా" అంది కరుణ అందంగా మూతి ముడిచి.

"రాయవేలూరేవిటి? డాక్టరేవిటి? ఫ్రెండేవిటి?" చిరాగ్గా అడిగాడు.

"అవునండీ ఏం తెలియనట్టు అలా మాట్లాడ్తారేం. కృష్ణమూర్తని కళ్ళ స్పెషలిస్టు రాయవేలూరులో మీకు ఓ స్నేహితుడున్నట్టే మరిచిపోయినట్లు మాట్లాడుతున్నారే!"

"కృష్ణమూర్తా? వాడు ఇక్కడికొచ్చాడా?" అన్ని వందల మైళ్ళ దూరంలో నున్నవాడు హఠాత్తుగా

ఎందుకు ఊడిపడ్డాడా తన పీకలమీదికి అనుకుని విసుగ్గా అడిగాడు.

'మిమ్మల్ని చూసి ఎన్నో ఏళ్ళు అయిందిట. కలకత్తా వెళ్ళొస్తూ మీరు గుర్తొచ్చి మిమ్మల్ని చూసిపోదామని ఇక్కడ దిగారుట. తీరా మీరు ఊరికెళ్ళారని చెప్పేసరికి చాలా బాధపడ్డారు. ఆయనకి పాపం చాలా అర్జంటు పనులున్నాయట." ఆగింది కరుణ.

వెళ్ళిపోయాడా ?'' అడిగాడు సుందరం ఆత్రంగానూ మరింత ఆనందంగానూ.

"లేదు ! వెళ్ళిపోతే మిమ్మల్ని మళ్ళీ చూడ్డం పడదనీను ... ముఖ్యంగా నాకు కళ్ళు తప్పకుండా వస్తాయన్న విషయం మీకు ఖచ్చితంగా బోధపరచడానికీను రాయవేలూరు టెలిగ్రాం యిచ్చేసి ఉండిపోయారు పాపం', అంది కరుణ.

ఆ మాటల్లో బలీయమైన ఆత్మవిశ్వాసం, తనకి కళ్ళు వచ్చితీరాలన్న తీవ్రమైన ఆకాంక్షా స్పష్టంగా కనిపించాయి సుందరానికి !

హాయిగా సాగిపోతున్న జీవితంలోకి ఈ కృష్ణమూర్తి ఎక్కడ్నుంచి దాపురించాడు అన్న వ్యథ సుందరం మొహంలోనూ, మనసులోనూ నాటుకొంది. "ఏడీ వాడు ?" అడిగాడు.

'ఉదయంవే మాచెర్ల వెళ్ళారు. ఆయన పింతల్లి కూతురుందిట. సాయంకాలానిగ్గాని, రేపుదయానిగ్గాని వచ్చేస్తానన్నారు.''

"సర్లే. నాకొ్యంచెం చికాగ్గావుంది. కాస్సేపు పడుకుంటాను. వాడొస్తే లేపు'', అనేసి బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు సుందరం.

"నాకు కళ్ళురావడం అనే విషయం మీకెప్పుడూ చికాగ్గానే వుంటుంది'', అని అందామనుకున్న మాట కరుణ నాలుక చివరిదాకావచ్చి ఆగిపోయింది.

* * *

సుందరాన్ని ఎవరు చూసినా అతనికా పేరు చాలా అసందర్భంగా పెట్టారనిపిస్తుంది. పెట్టినవాళ్ళని తిట్టాలనికూడా అనిపిస్తుంది. చిన్నపిల్లలు చూసి జడుసుకునేంత వికృతంగా వుంటుందతని మొహం ! ఆ వికారానికితోడు మనిషి కారునలుపు ! లోతైన చిన్న కళ్ళు ! మొహంనిండా లోతుగా పెద్ద పెద్ద గంట్లు ! ఎంత అనాకారి ఆడదయినా ''పెళ్ళిలేకపోతే పీడాపోయింది'', అనుకుంటుందేగాని అతన్ని కట్టుకోడానికి కలలోనయినా ఊహించదు !

కాలేజీల్లో చదువుకునే రోజుల్లో అతనికున్న ఒకేఒక స్నేహితుడు కృష్ణమూర్తి. ఎప్పుడూ అతనివెంటే వుండేవాడు. కాని సుందరంతో తిరగడం మూలాన్న అందమయిన కృష్ణమూర్తిక్కూడా స్నేహితుల ఆదరణ లభించేది కాదు. అయినా కృష్ణమూర్తి సుందరాన్ని విడిచిపెట్టేవాడుకాదు. అతనికి

అందరూ అసహ్యించుకునే సుందరం మీద జాలీ, ప్రేమాను !

పుట్టి భూమిమీదపడ్డ క్షణంనుంచీ అసహ్యించుకుంటున్న ఈ ప్రపంచం మీద విపరీతమైన కసిని పెంచుకున్నాడు సుందరం. సుందరమైన మనసునికూడా వికృతం చేసుకున్నాడు. తనని చూసి అల్లంతదూరంనుంచే తప్పుకు నడిచే అందమైన ఆడపిల్లల మీద విపరీతమైన మోజు పెంచుకునే వాడు ! అందమైన అమ్మాయిలువచ్చి తన వొళ్ళో వాలాలని కలలు కనేవాడు. తనని చూసి వాళ్ళు ఆప్యాయంగా నవ్వే ఒక్క చిరునవ్వుకోసం చాలావిధాల ప్రయత్నించేవాడు. ఫలితం లేకపోగా అవమానం పాలయేవాడు. చివాట్లు తినే వాడు. చెప్పుదెబ్బలు తినేవాడు ! అదిగో అక్కడ్నుంచి ప్రారంభ మయింది సుందరంలో మానసిక సంఘర్షణ ! దానిని తట్టుకోలేక ఇమేజినరీ లైఫ్‌కి అలవాటుపడ్డాడు. రోడ్డుమీద కనపడ్డ ప్రతి అందమైన ఆడపిల్లా తనని వరించేసినట్లూ-తనతో అందమైన వెన్నెల రాత్రుల్లో షికార్లు కొడుతున్నట్లూ - ఈ ప్రపంచాన్నంతా ఎదిరించి తన వెంట వచ్చేసినట్లూ వేడి వేడి కలలు. ఈ అవస్థలో ఆడపిల్లల ఎదుట పడి అవకాశం లేకపోతే చాటుగుండానో అడగటం 'ఛీ' అనిపించుకోటంవూను. ఆస్తి-అంతస్తూ అన్నీ యిచ్చిన భగవంతుడు తనకి అందమైన పేరు మాత్రమే యిచ్చి ఊరుకున్నాడని దేవుడి మీద పగా-ద్వేషమూ !

తండ్రి చిన్నప్పుడే పోయాడు. తోబుట్టువు లెవరూ లేని ఏకాకి. తల్లి మాత్రం వుండేది. కొడుకు పెళ్ళిచూసి కన్నుమూయాలని ఆవిడ ఆశ ! నడుం కట్టుకుని సంబంధాలు వెతికేది. పిల్ల వరకూ వెళ్ళకుండానే పారిపోయేవి ఆ సంబంధాలు ! కొడుక్కి పెళ్ళయే యోగంవూ తనకి కోడల్ని చూసుకునే అదృష్టంవూ లేవేమోనని బెంగపెట్టుకునేది. ఆవిడకో అన్నయ్య వుండేవాడు అతనికో అందంవైన కూతురుంది.

పేదరికం పంచన బ్రతుకుతున్న అన్నగారిని ఆర్థికంగా ఆదుకుంటూండేది. ఆయినింట్లో పిల్లనిస్తే కూతురు సుఖపడుతుందన్న ఆశ ఆడపిల్లనికన్న ప్రతి తండ్రికీ వుంటుంది కదా. పైగా తోడబుట్టిన చెల్లెలు. ఆమాత్రం ఆశ తన అన్నయ్యకూ్కూడా వుంటుందన్న ఆశతో కొడుకుని వెంటపెట్టుకు వెళ్ళింది. ఆ యింట్లో ప్రతి ఒక్కరూ సుందరాన్ని ఎంతో ఆప్యాయంగానూ, ప్రేమగానూ చూసారు. విశాలాక్షిని చూసిన సుందరానికి వెర్రెత్తిపోయింది. ఇంత అందమైన మేనమామ కూతుర్నుంచుకుని ప్రతీ ఆడపిల్లకోసం ప్రాకులాడ్డం తనుచేసిన వెధవ పనని మొట్టమొదటి



సారిగా అనుకున్నాడు. మేనమామ పేదరికం విశాలాక్షి తన పెళ్లాం కావడానికి దోహదం చేస్తుందనుకున్నాడు. పైగా అందరి ఆడపిల్లల్లాగా విశాలాక్షి తనని చూసి దూరంగా పారిపోలేదు. బావా అంటూ ఆప్యాయంగా మాట్లాడుతున్న ఆ అమ్మాయిమీద తన ప్రాణాలన్నీ నిలుపుకున్నాడు ప్రపంచంమీద తీరని పగని, ద్వేషాన్ని పెంచుకున్న అతని మనసులో ప్రేమ చోటుచేసుకున్నది ఆ క్షణంలోనే. ఇన్నాళ్ళకి ఓ ఆకపిల్ల మనసులో తనకు చోటుందని ధైర్యం కలిగిందీ ఆ క్షణంలోనే!

ఆ ధైర్యంతోనే ఓ రోజు ఇంట్లో ఎవరూ లేకుండా చూసి ఒంటరిగానున్న విశాలాక్షి దగ్గిర కెళ్లాడు. ధైర్యం చాల లేదు!

"ఏవిటి బావా ... ఏదో చెప్పాలని వచ్చి తిరిగి వెళ్ళిపోతున్నావు", చిలిపిగా నవ్వుతూ అడిగింది విశాలాక్షి, వెనక్కి తిరిగి వెళ్ళిపోబోతున్న సుందరాన్ని చూసి.

"నువ్వేదో పనిలో ఉన్నట్టున్నావు. తర్వాత" నంగిరిగా గొణిగేడు.

"పనీ లేదు పాటూ లేదు. ఒంటరిగా తోచక ఛస్తున్నాను" అంది. అంటే అర్థం ? తన జంట కోరుకుంటున్నట్లే కదా ! పోయిన ధైర్యం తిరిగొచ్చింది సుందరానికి.

"వచ్చిందగ్గిర్నుంచి నిన్నోమాట అడగాలనుకుంటున్నాను."

"ఒక్కమాటేం ఖర్మ బావా. వంద మాటలడుగు" అంది నవ్వుతూ.

అందమైన ఆ నవ్వుకి ఏ మగవాడికయినా వెర్రి ఎక్కాల్సిందే. సుందరానికి చెప్పక్కర్లేదు కదా.

"నన్ను గురించి నువ్వేం అనుకుంటున్నావు."

"మంచి బావవని". మళ్ళీ నవ్వుతూ అంది.

"అంతేనా మరే అభిప్రాయమూ లేదా", బిక్కగా అడిగాడు.

"ఓ ఆడపిల్లకి మేనత్త కొడుకు మీద వేరే ఏ అభిప్రాయం వుంటుంది బావా."

మళ్ళీ సుందరానికి ధైర్యం కూడగట్టుకుంది.

"వుండవలసిన అభిప్రాయమే వుందంటావు కదూ."

"వొట్టేసి చెప్పమంటావా ?" చిలిపిగా అంది.

సుందరానికి వెర్రి ఆవేశం వచ్చేసింది. విశాలాక్షి తన పెళ్లామయిపోయినట్లూ ... వెన్నెలరాత్రుల్లో మల్లెపూలు పరచిన మంచంమీద తన కౌగిలిలో వెన్నెలకన్నా అందమైన విశాలాక్షి... అప్పటికప్పుడే మధురమైన ఊహలు తన మనసునిండా రంగురంగుల బొమ్మలు గీసేస్తున్నాయి.

"ఏవిటి బావా మైకంలోకి జారిపోయావు అసల్సంగ జెప్పకుండా."

విశాలాక్షి అడిగేసరికి మళ్ళీ ఈ ప్రపంచంలోకి వొచ్చిపడ్డాడు.

"ఆ సంగతి నీకు చెప్పడం ఎందుకులే. మావయ్యకి చెప్తాను", అన్నాడు.

"ఏవిటట ?" అనుమానంగా అడిగింది విశాలాక్షి.

ఎంత అమాయకంగా అడుగుతోందీ అనుకున్నాడు సుందరం.

"అదే పెళ్ళికి ముహూర్తం ఎప్పుడు పెట్టిస్తావు మావయ్యా", అని.

"ఎవరి పెళ్ళికి."

"మన పెళ్ళికే."

ఒంటిమీద ఒక్కసారి వంద తేళ్ళు పాకినట్టు ఉలిక్కిపడింది విశాలాక్షి ! కోపంతో ఆ పిల్లమొహం ఒక్కసారి ఎర్రబడిపోయింది !

"నోర్ముయ్. మన పెళ్ళట మన పెళ్ళి. సిగ్గుగా లేదూ ఆ మాట అంటానికి. ఇప్పుడంటే అన్నావుగాని ఇంకెప్పుడూ అనకు. కల్లోకూడా అను

కోకు. నీ వికారమయిన బ్రతుక్కో పెళ్ళాం కావల్సొచ్చిందా. నీబోటివాడు మొగుడవటంకన్నా ఆడదానికి చావు హాయి. నన్నేకాదు నీ జీవితంలో పెళ్ళి చేసుకుని ఏ ఆడదాని బ్రతుక్కీ ఉరి తాడు బిగించకు. నీతో ఒక ఆడది సుఖపడ్డవనేది భగవంతుడు నీ మొహాన్న రాయలేదు. అదో ఖర్మగా భావించి ఈ జన్మకి ఊరుకో. నీ ఆస్తీ, అంతస్తూ గోదాట్లో తగలెయ్. ఏ ఆడదీ అవి చూసి నిన్ను కట్టుకుంటుందని కలలు గనకు. నాతోనే చెప్పావు కనుక ఇక్కడితో అయిపోయింది. ఇదే మా నాన్నకి చెబితే మెడబట్టుకు బయటికి తగిలేస్తారు. కుక్కని తరిమినట్లు తరి మేస్తారు. పిచ్చి పిచ్చిగా పేలకు వొళ్ళు దగ్గిరుంచుకుని మాట్లాడు." అనేసి తుఫానులా వెళ్ళిపోయిం దాపిల్ల.

మొహంమీద సాచికొట్టినట్లయింది సుందరానికి.

ఆ దెబ్బనుంచి తేరుకోడాని కతనికి సుమారు నెలరోజులు పట్టింది. ఇంకో మొగాడయితే ఆ పిల్ల అన్నమాటలకి అక్కడికక్కడే ఉరేసుకుని చావ వలసింది. సుందరం మాత్రం అతని ఆశలాగే చావలేదు!

దెబ్బతిన్న మనసు గాయపడ్డానికి బదులు దెబ్బకొట్టిన ఆడజాతిమీద విపరీతమైన పగని పెంచుకుంది. తోక తొక్కిన నాగుపాములా తయారయ్యేడు మనిషి.

ఈ సంఘటన జరిగిన చాలా రోజుల తర్వాత సుందరం యింట్లో అద్దెకు దిగారు సుందర్రామయ్యగారు. బట్టతల మీద వెంట్రుకలాంటి బ్రతుకాయనది. చాలీ చాలని జీతం. ఆరుగురు పిల్లలు. మొదటి పెళ్లాం మూడో పిల్లాడి పురిట్లో చచ్చిపోతే చచ్చిపోకుండా మిగిలి పోయిన పురిటికందుని సాకడానిగ్గాను రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆవిడ ఊరుకుంటుందా తనో ముగ్గురు పిల్లల్ని కంది. అన్నిటికన్నా ఆయన జీవితంలో జరిగిన ఒక విషాదకరమైన సంఘటన అతను తేరుకోలేనంత దెబ్బతీసింది. పిల్లలందరిలోకీ పెద్దది మొదటి పెళ్లాంకి తొలిచూలు ఆడపిల్ల బంగారుబొమ్మ కరుణ చిదిమి దీపం పెట్టుకోదగినంత అందమయిన ఆ చందనపు బొమ్మకి ఆ మధ్యనే ఘోరమైన ప్రమాదం జరిగింది. చావుతప్పి కన్నులొట్టపోయిం దన్నట్లు చావునుంచి తప్పించి దానికి పరిహారంగా రెండు కళ్లూ తీసుకున్నాడు దేవుడు! ఎదిగి కూర్చున్న ఆ పిల్ల పెళ్ళి ఒక పెద్ద సమస్యగా తయా రయింది సుందర్రామయ్యగారికి. కళ్ళే వుంటే ఆ పిల్లని నెత్తినపెట్టుకుని కానీ కట్నంలేకుండా చేసుకునేవాళ్ళే ఎవ రయినా. కాని వేలకొద్దీ కట్నం గుమ్మ రించినా కళ్ళులేని పిల్ల అందమయిన

దయితే మాత్రం చేసుకోటాని కెవరు వస్తారు. అథవా ఏ అనాథుడో వచ్చినా గుమ్మరించటానికి సుందర్రామయ్య దగ్గిర వేలేవీ?

ఓ రోజు అనుకోకుండా సుందరానికి తారసపడింది కరుణ. ఆ అమ్మాయి అందంచూసి కళ్ళు జిగేల్‌మన్నాయి సుందరానికి. తన ఇంట్లో అద్దెకు దిగిన వాళ్ళమ్మాయి అని తెలుసుకోడానికి ఎంతసేపు పట్టలేదో అందమయిన ఆ అమ్మాయికి రెండూ కళ్లూ లేవన్న సంగతి తెలుసుకోడానికీ అంతసేపూ పట్టలేదు. ఆ ఒక్క లోపంవూ తప్పించి మరే లోపంవూలేని కరుణ తన జీవితాన్ని హేళనచేసిన విశాలాక్షికన్నా ఏ కోణంలోంచి చూసినా ఎన్నో వేల రెట్లు అందంవయింది. ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే విశాలాక్షి కళ్ళు కుట్టుకు చస్తుంది. తనని పెళ్ళిచేసుకోడానికి ఈ అమ్మాయి యిష్టపడుతుందా? యిష్టపడ ప్పోడానికి ఈ అమ్మాయికి కళ్ళు లేవుగా. గుడ్డిదానికి యిష్టాయిష్టాలేం వుంటాయి. దయతలచి పెళ్ళిచేసుకుం టున్నాడని గుండెల్లో పెట్టుకుని పూజి స్తుంది. రెండు కళ్లూవున్న ఏ ఆడ దయినా తనని ఈ జన్మలో పెళ్ళిచేసు కోదు. తన డబ్బు చూసి చేసుకున్నా తనతో కాపరం చెయ్యదు. అందుకని కళ్ళులేని ఈ అందాల బొమ్మని పెళ్ళి చేసుకుంటే కళ్ళు చెదిరే ఆ అందాలన్నీ తన స్వంతమవుతాయి. కళ్ళులేని ఆ పిల్లకి తను నవమన్మథుడిగానూ కన పడ్తాడు. ఇలా రాజీపడకపోతే నిత్యం గుండెల్లో జరిగే సంఘర్షణకి ఎప్పుడో అప్పుడు తను బలిఅయిపోక తప్పదు. ఇంత ఆలోచన తర్వాత ఆ అమ్మాయి నెలాగయినా పెళ్ళిచేసుకోవాలని నిర్ణ యించుకున్నాడు సుందరం. తల్లికి ఆ రాత్రే చెప్పాడు. గుడ్డిపిల్లని మొదట్లో ఆవిడ సంకోచించినా గుడ్డిదో, కుంటిదో తన కొడుక్కి పెళ్ళయితే అదే పదివే లనుకుంది ఆ ముసలి తల్లి. కబు రంపింది.

పిల్లకి కళ్ళులేవని తెలిసికూడా పెళ్ళి మాటలకి కబురుపెట్టారంటే ఇందులో ఏదో వుండివుండా లనుకున్నాడు. సుంద ర్రామయ్య. సుందరాన్ని చూసేకగాని ఆయన కారణం గ్రహించలేదు.

ఆ రాత్రి......

"చూస్తూ చూస్తూ ఈ బంగారు బొమ్మని తీసుకెళ్ళి ఆ కురూపికెలా కట్ట పెట్టమంటావే" అన్నారు సుంద ర్రామయ్యగారు పెళ్ళాందగ్గిర భయ పడ్తూ.

"కట్టపెట్టలేకపోతే తండ్రీ, కూతురు కట్టకట్టుకుని గోదాట్లో దూకండి. కళ్ళు లేనిదాన్ని దయతలచి పెళ్ళిచేసుకుంటు న్నాడు కానీ అడక్కుండా.కురూపి కాక పోతే నవమన్మథుడు చూస్తూ చూస్తూ గుడ్డిమేళాన్ని మెడకట్టుకుంటాడా?

అయినా మొగాడికి అందంవేంటి. అయినా ఈ అపురూపాలు చూస్తూ కూర్చుంటే దానికీ జన్మలో పెళ్ళికాదు మన పంచన పడుస్తూ బ్రతకాల్సిందే. కోరి చేసుకుంటానంటున్నాడు. ఆ మూడు ముళ్ళూ పడేలా చూడండి. కాలదన్నుకుని తర్వాత ఏడిస్తే నలుగురూ ఛీ అంటారు", అంది పెళ్ళాం ఈసడింపుగా.

అవును పెళ్ళాం చెప్పిందీ నిజంవే మరి! కళ్ళకద్దుకుని చేసుకుంటామని వచ్చిన సంబంధాన్ని కోరి కాలదన్నుకుంటే ఈ జన్మలో కూతురి పెళ్ళి చెయ్యటం అతని వల్లకాదు తల్లీ-కొడుకు తిని కూర్చున్నా తరగని ఆస్తి. కూతురు సుఖపడుతుంది. అంత ఆలోచన తర్వాత కూతుర్ని సుందరానికిచ్చి పెళ్ళిచెయ్యటానికే నిశ్చయించుకున్నాడు. ఆ ముక్కే మర్నాడు సుందరంతో అన్నాడు.

"మీ అమ్మాయి నడిగారా?" అని అడిగాడు సుందరం ఆయన్ని.

"అడగక్కర్లేదు. అయినా కళ్ళులేని తనని పెళ్ళిచేసుకోడానికి ముందుకొచ్చే దేవుడిని ఏ ఆడపిల్లయినా ఎందుకొద్దంటుంది బాబూ." అంది సుందరామయ్య పెళ్ళాం.

"అదికాదు. మీ అమ్మాయికి నా గురించి చెప్పారా?" అనుమానంగా అడిగాడు సుందరం.

"ఇంకా చెప్పలేదు", అన్నారు సుందరామయ్య.

"ఇంకా కాదు. చెప్పకూడదు. నా రూపం గురించి మీరు చెప్పారని పెళ్ళయింతర్వాత నాకేమాత్రం తెలిసినా మీ అమ్మాయి నాతో ఆ మరుక్షణం నుంచీ కాపరం చెయ్యదు", కటువుగా అన్నాడు సుందరం.

"అంటే", అన్నాడు తెల్లబోయి సుందరామయ్య.

"అంటే గింటే ఏవిటండీ. అబ్బాయి చెప్తోంది అర్థంకావటంలేదూ ఏపీ చెప్పం బాబూ. నీకా అనుమానం ఏం అక్కర్లేదు", అంది సుందరామయ్య పెళ్ళాం హామీ యిస్తూ.

"సరే — పెళ్ళి ఈ ఊళ్లో జరక్కూడదు. తిరుపతిలో చెయ్యండి. ఖర్చంతా నేను భరిస్తాను. పెళ్ళికికూడా ఎవర్నీ పిలవకండి", అని విసురుగా వెళ్ళిపోయాడు లోపికి సుందరం.

ఇవన్నీ వింటున్న సుందరం తల్లి గాఢంగా నిట్టూర్చింది.

"కుర్రాడి మాటలకి మరోలా అనుకోకండన్నయ్యగారూ. చిన్నప్పటినుంచీ వాడి తరహాయే అంత. ఆడంబరాలంటే గిట్టవు", అంది కొడుకు దురుసుతనానికి క్షమాపణగా.

"అయ్యో ఎంతమాట తల్లీ. అబ్బాయి యిష్టప్రకారంవే చేద్దాం."

అన్నాడు సుందర్రామయ్య ఏమనాలో తోచక.

చాలా నిరాడంబరంగా జరిగిపోయింది పెళ్ళి

మొదటిరాత్రి కరుణ తనని కరుణించిన దేవుని వొళ్లోపడుకుని తన గుడ్డి బ్రతుకోకి వెలుగు చూపినందుకు కృతజ్ఞతలు తెలియపరుచుకుంది. సుందరానికీ భయం వెంటాడ్డం మానలేదు. తన వికృతరూపం గురించి ఎవరు ఎప్పుడు పెళ్ళానికి చెప్పేస్తారోనని తన పెళ్ళాం తను కురూపినన్న విషయం తెలుసుకుని ఊహల్లో కూడా తనని అసహ్యించుకుంటే భరించలేని పిరికివాడు. కళ్ళు లేని ఆమెకి తన రెండు కళ్ళూ ఇచ్చి జీవితాంతం పూజించుకోగలడు. కాని ఆమె కళ్ళు వెలుగు సంపాదించుకుని ఆ వెలుగులో తన వికృతరూపం చూసి తనకు జరిగిన మోసానికి ఆమె తనను అసహ్యించుకుంటే... ఆ ఊహంటేనే అతనికి భయం ! అందుకే తన గురించి ఆమె తెలుసుకునే అవకాశంలేకుండా తగిన కట్టుదిట్టాలన్నీ పకడ్బందీగా చేసుకున్నాడు. పెళ్ళయి తిరిగొచ్చిన మరుసటిరోజే వున్నవూళ్ళో ఆస్థిపాస్తి అమ్మేసి గుంటూరు మకాంమార్చేసాడు. వుద్యోగం చెయ్యాల్సిన అవసరంలేదు కనుక చిన్న వ్యాపారం ప్రారంభించి ఆ వూళ్ళోనే స్థిరపడ్డాడు. కాలక్రమంలో తల్లి కాలంచేసింది. అంత యింటిలోనూ ఆ యిద్దరే పనివాళ్ళకు సహితం పనిలో పెట్టుకునేముందే వార్నింగు ఇచ్చాడు అనవసరంగా ఏ విషయం తన గురించి ఆమె ముందు మాట్లాడకూడదని. అన్ని విధాలా తనకి తానుగా తనచుట్టూ ముళ్ళకంచె నల్లుకుని అదిదాటి ఆనందంగా సాగిపోతున్న వాళ్ళజీవితంలోకి ఏ చికాకు తొంగి చూడకుండా అన్ని కట్టుదిట్టాలూ చేసుకుని సుఖంగా జీవితాన్ని సాగిస్తున్నాడు. కరుణకూడా సుందరాన్ని ప్రాణానికి ప్రాణంగా చూస్తోంది. తన చీకటి జీవితంలో దయతో - ప్రేమతో - సానుభూతితో తనకి వెలుగు ప్రసాదించిన సుందరానికి చాలా కృతజ్ఞతగా వుంటోంది. ఎంత ఆనందంగా జీవితం సాగిపోతున్నా ... ఏ లోటూలేకుండా రోజులు గడిచిపోతున్నా తన బ్రతుకులో తనకి భగవంతుడు ఏర్పరిచిన లోటు గురించి ఆలోచించని క్షణంలేదు. తెలిసీ తెలియని వయసులో ... అందం అనే పదానికి నిర్వచనం తెలియని రోజుల్లో ఘోరమైన ప్రమాదం జరిగి తన కళ్ళుపోయాయి. తనకి కళ్ళు పోయింతర్వాతే ఈ ప్రపంచం ఎంత సుందరమయిందో తనకి తెలిసింది ! ఇంత అందమైన ప్రపంచాన్ని తనివి తీరా చూడాలనే బలీయమైన కోరిక ఆమె అంతరాంతరాల్లో గూడుకట్టుకుని ఉంది. పెళ్ళయి జీవితానికో కొత్తరుచి,

మనసుకో ఇంత అనుభూతి ఏర్పడిం తర్వాత ఆ కోరిక మరింత పటిష్ఠమయి కూర్చుంది. తననింత ఆప్యాయంగా, అనురాగంగా చూసే తన భర్తని కళ్లారా చూసుకోవాలనీ వాటి వెనుకనున్న అందాల్ని మనసారా ఆస్వాదించాలనీ... అందుకయినా తన కళ్ళు తన కిమ్మని ఆమె భగవంతుడిని ప్రార్థించని రోజు లేదు! పెళ్ళయిన ఓ సంవత్సరం తర్వాత కాబోలు ఓ వెన్నెలరాత్రి... చల్లనివేళా మొగుడి గుండెలమీద పడుకుని-

"ఈ దేవుడిని చూడ్డానికి భగవంతుడు నా కళ్లు నాకు తిరిగిస్తే బాగుండును కదూ", అంది.

ఆ మాట సుందరం గుండెల్లో శూలంలా గుచ్చుకుంది.

"నీ కళ్ళులేనిలోటు నా రెండు కళ్లూ తీరుస్తున్నాయి కదా", అన్నాడు.

నీకు ఆకలేస్తూంది కదాని నేను భోంచేస్తున్నాను. నీ ఆకలి తీరినట్టేకదా అన్నట్టుంది అతని మాట! ఎవరి అనుభవాన్ని వారు అనుభవించాలి. ఒకరు అనుభవించగా విన్నంతమాత్రాన తను అనుభవించినట్లెలా అవుతుంది.

"కాదనలేను. కాని నాకు కూడా కళ్ళొస్తే ఈ ప్రపంచాన్ని నాలుగు కళ్ళతో చూడొచ్చుకదా", అన్నది తిరిగి ఆమె.

"అవును కాని కోరి ఆపదని తెచ్చుకోడం ఎందుకు చెప్పు. నీకు మళ్ళీ ఏదయినా జరిగితే నేనేమయిపోతాను చెప్పు", అని లాలనగా గుండెల కదుముకుని అప్పటికా ప్రస్తావన దాటే యించాడు

అప్పటికే కాదు. ఎప్పటికప్పుడు ఏవో మాయమాటలు చెప్పి ఆమెని ఆ ఆలోచనన్నుంచి తప్పిస్తూ వచ్చాడిన్నాళ్ళూ.

కాకపోతే ఆమె కళ్ళకి వెలుగొస్తే తన బ్రతుకు చీకటయిపోదూ.

అలా అంటూ జరిగితే తనపై ఆమె చూపిస్తున్న ఈ అనంతమైన ప్రేమా... తన మీదుండే ఈ అందమైన అభిప్రాయమూ దగా అయిపోవూ? ఆమెకు కళ్ళువచ్చినట్లయితే ఆమె చూసే మొట్ట మొదటి చూపు ఎంత భయంకరంగా వుంటుందని! తనామెకు చేసిన అన్యాయానికి ఆమె చూసే మొట్టమొదటి చూపులో ఎంత అసహ్యం వుంటుందో ఎవరు చెప్పగలరు. అక్కడితో ఈ జీవితానికి శాశ్వతమైన ఫుల్‌స్టాప్ ఏర్పడిపోతుంది! ఏరి కోరి ఆ భయంకరమైన నన్నివేశానికి జీవితంలో చోటివ్వడం ఎందుకని? ఆమె ఆజన్మాంతం గుడ్డిగా వుండేనే తనకి ఆమె హృదయంలో ఉన్న పవిత్రమైన భావన పదికాలాలపాటు పదిలంగా వుంటుంది.

కళ్ళ ఆపరేషనంటే ఏదో మామూలు

ఆపరేషనులాంటిదికాదనీ కళ్ళకు సంబంధించిన వరాలు చాలా సున్నితమయినవనీ-ఈ ఆపరేషనువల్ల అవి ఏమాత్రం దెబ్బతిన్నా ప్రాణానికే ముప్పువస్తుందనీ...అయినా తన భార్యకి కళ్ళు లేక పోవడం అతన్నే విధంగానూ జీవితంలో బాధించడంలేదనీ ... ఆపరేషను మూలంగా ఏమాత్రం అపకారం జరిగినా తనా దుర్భరవేదన భరించలేడనీ...భరిస్తూ బ్రతకలేడనీ...ఆమె లేని శూన్యమైన జీవితాన్ని తాను కోరుకోలేడనీ... కల్లబొల్లి కబుర్లుచెప్పి దాటేయిస్తూ వచ్చాడిన్నాళ్ళూ !

కాని ఈ కృష్ణమూర్తి పూటిపడ్డంతో పరిస్థితి అనుకోని విధంగా మలుపు తిరిగి ఈసారి దాటెయ్యలేనంత విపరీతానికి దారితీస్తుంది కాబోలని ఆలోచిస్తూ పడుకున్న సుందరానికి కృష్ణమూర్తి వచ్చిన సందడితో తెలివొచ్చింది.

* * *

ఆ రాత్రి భోజనాలయ్యేక స్నేహితులిద్దరూ డాబామీద వెన్నెల్లో కూర్చున్నారు కరుణ కూడా సుందరం పక్కనొచ్చి కూర్చుంది. ఆ కబురు, ఈ కబురు ఆయేక కృష్ణమూర్తి అసలు విషయంలోకి దిగాడు.

"నీ పెళ్ళికందే పిలవలేకపోయావు. పోనీ పెళ్ళయింతర్వాత దెట్టంత నీ స్నేహితుడు కళ్ళ డాక్టరుగా వున్నాడు కదా చెల్లెమ్మ కళ్ళ గురించయినా నాకో వుత్తరం ముక్క రాయడానికేంరా సుందరం ?" సూటిగా అడిగాడు.

"ఇక్కడ ఒకరిద్దరు డాక్టర్లని అడిగానురా. రావడానికి ఎక్కువ అవకాశాలు లేవన్నారు. పైగా మేజరు ఆపరేషను చెయ్యాల్సుంటుందన్నారు. లేనిపోని బెడదని కొని తెచ్చుకోడవెందుకని", నీళ్ళు నములుతున్నట్టు అన్నాడు సుందరం

ఆ మాట పచ్చి అబద్ధమని కరుణకి తెలుసు. అయినా ఏం మాట్లాడలేదు.

"ఎవడా చెప్పిన ఫూల్. నేను టెస్ట్ చేసాను. ఆవిడకి కళ్ళు వచ్చి తీరతాయి. నాది పూచీ. నువ్వు ఇక్కడ వ్యవహారాలన్నీ చూసుకుని ఆవిడని తీసుకుని వేలూరొచ్చి ఒక నెలరోజులున్నావంటే చాలు," అన్నాడు కృష్ణమూర్తి. సుందరం ఏమీ చెప్పలేకపోతున్నాడు. వచ్చినవాడు చూసింది చూసినట్టు పోకుండా ఈ తుఫాను రేపేడు ఏ ఆపరేషనూ వద్దు నీ పుణ్యం వుంటుంది నా బ్రతుక్కి నిప్పంటించి పోకు నీ దారిన నువ్వెళ్ళు అని అనేద్దామని వుంది సుందరానికి. అలా అంటే తనలోని రాక్షసత్వం బయటపడిపోతుంది గుడ్డి పెళ్ళాంకల ఏ మొగుడయినా ఎంత దరిద్రావస్థలోవున్నా తన పెళ్ళానికి కళ్ళురావాలని కోరుకుంటాడు. వచ్చే అవకాశం సూదిమొనంత కనిపిస్తేచాలు తన బ్రతుకంతా వెచ్చించయినా ఆమెకు

చూపు తెప్పించటానికి ప్రయత్నిస్తాడు. అలాకాకుండా తన పెళ్ళాం గుడ్డిగా వుండిపోవాలని కోరుకునేవాడు మొగుడూ కాడు; మనిషి అసలే కాడు.

సుందరం మొహంలో చెలరేగే సంఘర్షణని ఊహించలేకపోయాడు కృష్ణమూర్తి.

"ఉలుకూ పలుకూ లేకుండా ఏవిటిరా ఆలోచిస్తున్నావు"? అడిగాడు.

"ఆఁ ఏంలేదు. నిజంగా కళ్లు వస్తాయంటావా", భయంగా అన్నాడు సుందరం.

"ఓరి ఫూల్ చెప్పేదంతా ఏవిటిరా మరి. షి విల్ డెఫినెట్‌లీ గెట్ ది సైట్. అంత హోప్‌లేకుండా ఎందుకురా నేను చెప్తాను. బై ది బై వియన్నాలో నేను రిసెర్చి చేస్తున్నప్పుడు మా ప్రొఫెసరు ఒకాయన వుండేవాడు. ఆయన చెయ్యి వేస్తే పుట్టు గుడ్డివాడికయినా కళ్లు వస్తాయి. ఫార్చునేట్లీ హి విల్ బి గోయింగ్ ఓవర్ హియర్ ఇన్ ఎ మంత్. ఆయన వుంటుండగా ఈ ఆపరేషను జరిగితే వుయ్ హేవ్ బెటర్ హోప్స్. అయినా ఏదో జరుగుతుందని భయపడి ప్రయత్నం చెయ్యకపోవటం తప్పు కదా", అన్నాడు కృష్ణమూర్తి సిగరెట్ వెలిగించుకుంటూ.

సుందరానికి ఈ పరిస్థితి చాలా చికాగ్గా వుంది. వీల్లేదు అని చెప్పి స్నేహితుడిముందు, పెళ్లాంముందు తన తాంపెళ్లకు బయటపెట్టలేడు. అలా గేనని చెప్పి జరగబోయే దారుణాన్ని ఎదుర్కోలేడు. మొగుడి ఆలోచన ఏమిటో ఎంత బుర్రపగలకొట్టుకున్నా కరుణ కర్థంకాలేదు. తను బోధ్యం చేసుకోపోతే తర్తమౌనాన్ని అర్ధాంగీకారంగాకాకుండా అనంగీకారంగా ఎదుటి మనిషి అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడే ప్రమాదం వుంది

"ఏఁవీ భయంలేదని అంటున్నారు కదా ఆయన. ఈ చీకటి బ్రతుకులోంచి బయటపడి వెలుగు చూడగలనేమోనన్న ఆశ వుంటున్నకొద్దీ పెరిగిపోతోంది. ఈ ప్రయత్నంతో ఆ ఆశ తీరడఁవో లేకపోతే పూర్తిగా చావడఁవో తేలిపోతుంది కదా. ఇంక ప్రాణంమీదకు వస్తుందంటారా. నా గుడ్డితనంతో చీకటయిపోయిన మీ జీవితంలో వెలుగయినా తొంగి చూస్తుంది", అంది కరుణ

ఆమె కన్నుల్లో నీరు వెన్నెల్లో తళతళలాడ్డం కృష్ణమూర్తి గమనించాడు

"వద్దు కరుణా నీకు కళ్లురావడం నా కిష్టంలేదు. ఎందుకంటే నువ్వు ఊహించుకుంటున్న ఈ సుందరమైన ప్రపంచం నీకు కళ్ళొచ్చిన మరుక్షణంలో ఎంత వికృతంగా వుంటుందో నీకు తెలిసిపోతుంది. అంత వికృతాన్ని చూసిన నీ మొహంలో ఆ క్షణం లో

ఏర్పడ్డ అసహ్యమైన భావనని అందు లోంచి పుట్టిన నీ కఠినమైన చూపుని భరించగలిగి నేను బ్రతకలేను ఈ చీకట్లో నువ్వు చూస్తున్నదే ఎంతో సుందరమైనది", అని చెప్పగలిగే ధైర్యాన్ని దేవుడు తనకిస్తే ఎంత బాగుండును అనుకున్నాడు సుందరం.

"చూడరా సుందరం ఆమెకున్న పాటి ధైర్యం నీకు లేకుండా పోయింది. జీవితంలో ఏ లోటునయినా ఏదో విధంగా సరిపెట్టుకోగలం. కాని గుడ్డి తనాన్ని ఏ కోణంలోనూ సరిపెట్టుకో లేం. చీకటి ఎంత భయంకరంగా వుంటుందో నీకు తెలీదురా. కటిక చీకటిలో ఒక చిన్న కాంతిరేఖకోసం పరితపించిపోయే మనసులోని వేదన మనకి అర్థం కాదురా ఎంతోమంది కళ్ల లేనివాళ్ళకి కళ్ల నిస్తున్న ఈ చేతులతో మీ చీకటి జీవితంలో ఏమాత్రం వెలుగు నివ్వగలిగితా నేను చాలా అదృష్ట వంతుడిని. లెటిట్ బి ఎ హోప్. నో హార్మ్ టు ట్రై ఫర్ ఇట్. మా ప్రొఫె సర్ నుంచి ఈపాటికే కన్ఫర్మేషను వచ్చేసుంటుంది నే వెళ్ళగానే ఉత్తరం రాస్తాను. మీరిద్దరూ వెంటనే బయలు దేరి రండి. అశ్రద్ధ చెయ్యొద్దు చెయ్యి జారిపోతే అవకాశమూ, అదృష్టమూ తిరిగిరావు", అన్నాడు కృష్ణమూర్తి.

సుందరం అవునని అనలేదు, కాదని అనలేదు!

ఆ మర్నాడుదయం కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ కనీసం పదిసార్లయినా చెప్పుకుంటాడు ఇద్దర్నీ కలిసి రమ్మని.

"చూద్దాం. నువ్వెళ్ళి ఉత్తరంరాయి", అన్న ముక్క అనగలిగాడు సుందరం సభ్యత కోసంవని.

ఆ ఒక్క ముక్కా కరుణ మనస్సు కెంతో ఆహ్లాదాన్ని కలిగించింది. తన ఆశకి వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది.

* * *

"సార్ టెలిగ్రాం" అన్న పోస్ట్ మేన్ కేక విని కరుణ పనిమనిషిని పిలిచి తీసుకోమంది. పనిమనిషి వేలి ముద్రతీసుకుని టెలిగ్రాం యిచ్చేసి వెళ్ళి పోతున్న పోస్ట్‌మేన్‌ని పిలిచి ఆ టెలిగ్రాం చదివి వినిపించమంది కరుణ.

"ప్రొఫెసర్ ఎరైవ్డ్. ఎగ్రీడ్ టు ఎక్జామిన్ అవర్ కేస్-స్టార్ట్ ఏజ్ ఎర్లీ ఏజ్ పోజిబుల్" కృష్ణమూర్తి.

ఒక్కసారి ఎగిరి గంతేసింది కరుణ. అంత మంచి వార్త మోసు కొచ్చిన పోస్ట్‌మేన్‌కి అయిదు రూపాయి లిచ్చింది. అమ్మగారి మొహంలో అంత సంతోషాన్ని ఇదివరకెన్నడూ చూడని పనిమనిషి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయిందో క్షణంసేపు. ఆ రోజు ఆమె సంతోషానికి పట్టపగ్గాల్లేవు. స్నానం చేసి మొగుడి కిష్టమయిన చీరకట్టుకుని తల్లో పూలు పెట్టుకుని అపర రతీదేవిలా



తయారయి అందమయిన మొహం నిండా మరింత అందమయిన నవ్వు పులుముకుని భర్త వచ్చే క్షణంకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

సుందరం అడుగుల చప్పుడు వినీ వినగానే పరుగున వెళ్ళి అతన్ని చుట్టేసింది. బంగారు బొమ్మలావున్న భార్య వచ్చీ రాగానే ఇంత ఆనందంగా వచ్చి ఎందుకు కౌగలించుకుందో - ఇంత సంతోషానికి కారణం ఏమిటో ఆ క్షణంలో అతనూహించలేకపోయాడు.

"ఏమిటి ఈ రోజు దేవిగారికింత దయకలిగింది" అన్నాడు మరింతగా గుండెలకు హత్తుకుంటూ.

"దీనమైన మన జీవితాలమీద దేవుడికే దయకలిగింది" అందామె.

"అవును మరి. ఎంత దయకలగక పోతే వచ్చీ రాగానే ఇంత సుఖమైన కౌగిలి ప్రసాదిస్తాడు" అన్నాడు నవ్వుతూ.

"ఛీ—సరేకాని మీకు సంతోషమైన వార్త చెబితే ఏఁవిస్తారు ?"

"ఎంత సంతోషమైన వార్త ? ఇంతా ?" అన్నాడు ఆమె కడుపుమీద చెయ్యేసి రాస్తూ.

"అదేంకాదు" అంది గోముగా.

"మరేదో చెప్పండి సార్" అన్నాడు లాలనగా.

"మనల్ని ఎంతవేగం వీలయితే అంతవేగం బయలుదేరి రమ్మని మీ కృష్ణమూర్తిగారు టెలిగ్రాం యిచ్చారు" అందామె.

తాడనుకుని పామును పట్టుకున్న వాడికి అది పామని తెలిసిన క్షణంలో ఎంత చట్టున విదిలిస్తాడో అంత చట్టున వదిలేసాడామెని.

ఏది రాకూడదని ప్రతిరోజూ దేవుడిని ప్రార్థిస్తున్నాడో అదే వెంట తరిమి వచ్చేసరికి సుందరం గుండెల్లో రాయిపడింది ఆ క్షణంలో కృష్ణ మూర్తిని పీక పిసికి చంపెయ్యాలన్నంత కోపంవొచ్చింది. ఏదో తన బ్రతుకు తనని బ్రతకనియ్యకుండా తగుదునమ్మా అంటూ వచ్చి ఈ బెడదొకటి తెచ్చిపెట్టాడు.

కళ్ళు లేకపోయినా భర్తమొహంలో వికారాన్ని సులువుగా గ్రహించింది కరుణ.

"టెలిగ్రాం వచ్చింది చూడరేం" అంది.

"చూడ్డంవెందుకిక. చెప్పేవుకదా" అన్నాడు నిర్లిప్తంగా.

ఆ సమాధానానికి ఆమె చిన్న బోయింది.

"అయితే మనం ఎప్పుడు బయలు దేరుదాం ?"

'నీ యిష్టంవొచ్చినప్పుడు బయలు దేరు."

"బయలుదేరు అంటున్నారు. మీరు రారా ?"

"ఆపరేషను నాకు కాదుగదా."

"బాగుంది. మీరులేకుండా నేనొక్క దాన్నీ వెళ్ళనా ?"

"పనిమనిషిని తోడు తీసుకు వెళ్ళు."

"నాకు భయం బాబూ మీరురాకుండా నే వెళ్ళలేను"

"నాకు కూడా భయమే అందుకే నేను రాను."

"ఒక్కమాటడుగుతాను. సూటిగా జవాబు చెప్పండి."

"అడుగు"

"నాకు కళ్ళు రావటం మీ కిష్టం లేదా ?" కటువుగా అడిగింది. ఆమె మాటల్లో అంత కఠినత్వాన్ని ఎప్పుడూ ఎరగని అతను కలవరపడ్డాడు. తన మనసులోని భావాన్ని ఆమె

పనికట్టేసిందేమోనన్న భయంకూడా కలిగింది.

"ఎంత మాటన్నావు కరుణా. నీ చీకటి జీవితంలోకి వెలుగు రావటాన్ని సహించలేనంత దుర్మార్గుడిగా భావిస్తున్నావా. కాకపోతే ఈ ఆపరేషను మూలంగా నీకు కళ్లొస్తే సంతోషమే. కళ్ళు రాకపోయినా నిన్ను నేను గుండెల్లో దాచుకోగలను. అదీకాక ఇదీకాక మరేదేనా అవుతుందేమోననే నా భయం. ఎందుకో కృష్ణమూర్తి వచ్చి వెళ్ళిందగ్గిర్నుంచీ నా మనసు కీడునే శంకిస్తోంది. ఈ ప్రపంచంలో నానుంచి ఏది దూరమయినా భరించగలను. కాని నువ్వు దూరమయితే నేను భరించలేను, బ్రతకలేను. దయచేసి ఈసారికి డ్రాప్ చేసేద్దాం. అనుమానంగా ఏ పనిచేసినా అది ఫలించదు", అన్నాడు ఆవేదనగా.

"భయంవేస్తోందని ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే మనకి ధైర్యం కలిగినప్పుడు రమ్మంటే వస్తాడా అంత పెద్ద డాక్టరు. అంత దూరంనుంచి ఆ డాక్టరు నాకు కళ్లు ప్రసాదించడానికే మనదేశం వచ్చాడా అనిపిస్తోంది నాకు. అయినా మీ భయంకాని ఏ ప్రమాదమూ జరగదని కృష్ణమూర్తిగారు హామీయిచ్చారు కదా. అంత ప్రాణాపాయమైన ఆపరేషనే చెయ్యాల్సొంటుందని ఆ డాక్టరంటే అప్పుడు ఆలోచిద్దాం. నా కళ్లకి వెలుగు రావాలనీ... ఆ వెలుగుతో నా చీకటి జీవితానికో నీడ కల్పించిన మిమ్మల్ని చూసుకోవాలనీ నా మనస్సెలా తపించిపోతోందో మీకెలా చెప్పగలను, ఇంత వరకూ మిమ్మల్నేదీ కోరలేదు. ఈ జీవితానికి మొదటిదీ ఆఖరుదీ అయిన ఈ కోరిక తీర్చమని ప్రార్థిస్తున్నాను. కాదనకండి" అంటూ అతని పాదాల చెంత వాలిపోయిందామె

ఆమె నిశ్చయాన్ని మార్చడం బ్రహ్మతరం కాదన్న సంగతి తేలిపోయింది సుందరానికి.

"సరే నీకంత బలమైన నమ్మకం వుంటే నువ్వెళ్లు కరుణా. పనిమనిషి తోడొస్తుంది. ఆపరేషను సక్సెస్ అయి నీకు చూపు వచ్చిందని టెలిగ్రాం యిస్తే నేనొస్తాను" అన్నాడు సుందరం ఆమెకు కళ్లురాగానే తననే మొట్టమొదట చూసి తననే మొట్టమొదట అసహ్యించుకునే పరిస్థితినయినా తప్పిద్దామని.

'వద్దులెండి. నాకేఆపరేషనూ అక్కర్లేదు. మీరూ నాతో వస్తేనే... అయినా నాకు కళ్లురావాలని కోరుకునేది ఎవరికోసం? అసలు నాకు కళ్ళువస్తే గిస్తే నేను కన్ను తెరిచి చూసే మొట్టమొదటి చూపు మిమ్మల్ని. మిమ్మల్నే మొట్ట మొదట చూడలేని ఆ చూపు నాకు వస్తేనేం? రాకపోతేనేం? మీరు రాకుండా నే వెళ్ళను. మీరు దగ్గిర లేకుండా నేను ఆపరేషను చేయించుకోను. నా

కంటికి వెలుగొచ్చిన మొదటిక్షణంలో మీరు నా ఎదురుగుండా వుడాలి. మొట్ట మొదట మిమ్మల్నే చూడాలి. అలా కానప్పుడు నాకా వెలుగు అఖర్లేదు"... అంది కరుణ కంటిని చిందిన కన్నీటిని తుడుచుకుంటూ.

ఏ భయంకర క్షణంకయితే తను భయపడి దూరంగా పారిపోతున్నాడో ఆ క్షణం తరిమి తరిమి తనను వెంటాడి వేటాడుతోంది. తప్పదు! ఆ క్షణం చివికి తను చిక్కిపోక తప్పదు. ఒక్కసారి నిశ్చలంగా కరుణ మొహంలోకి చూసాడు, అందమైన ఆమె మొహంలోకి... దృఢనిశ్చయంతో వున్న అమె మనసులోకి మార్చి మార్చి చూశాడు.

కొద్దిరోజుల్లో ఈ ప్రపంచంలో వున్న వెలుగునంతటినీ తనలో యిముడ్చుకో డానికి తహతహలాడే ఆమె విశాలమైన కళ్లని చూసాడు.

మరోసారి!

మరోసారి!

వందసార్లు... వెయ్యిసార్లు...లక్షల సార్లు

అంతే ఒక నిశ్చయానికొచ్చాడు!

ఆమెను మనసారా కౌగలించుకున్నాడు!

ఆప్యాయంగా గుండెలకదుముకున్నాడు!

నుదుటిమీద— పాపిట సిందూరం మీద అందమైన కళ్ళమీద... ఎర్రటి పెదవులమీద అనురాగంలో ముద్దుపెట్టుకున్నాడు.

తన గాఢ పరిష్వంగంలో వొదిగి పోయిన ఆమెతో "మనం రేపే బయలు దేరుదాం" అన్నాడు.

* * *

"షి విల్ గెట్ ది సైట్. బట్ షి హేడ్ టు అండర్ గో ఏ విటిర్ మేజర్ ఆపరేషన్. ఆర్ దే ప్రిపేర్డ్ ఫర్ యిట్ మిష్టర్ మూర్తీ..." అన్ని టెస్టులూ పూర్తిచేసిన తర్వాత అన్నాడు వియన్నానుంచి వచ్చిన ప్రొఫెసర్ గేబ్రియల్.

కృష్ణమూర్తి సమాధానం చెప్ప బోయేముందు సుందరంవేపు చూసాడు. దానికి సమాధానంగా సుందరం కరుణని కళ్ళతోనే చూపించాడు.

"ఏమ్మా డాక్టరుగారు నీకు చూపు తప్పకుండా వస్తుందంటున్నారు అయితే కొంచెం పెద్ద ఆపరేషను చెయ్యాల్సుంటుందనీ దానికి మీరు సిద్ధపడే వచ్చారా? అనడుగుతున్నారు" అన్నాడు మూర్తి కరుణతో.

"వారు సిద్ధపడితే నాకేం అభ్యంతరం లేదు" అందామె

"ఏవిరా ఏంచెప్తావిప్పుడు?" అన్నట్టు చూసాడు మూర్తి సుందరంవేపు

ఆ క్షణంలో తనెలాంటి అభ్యంతరాలు చెప్పినా అందరూ తననో ఫూల్ని

చూసినట్లు చూస్తారు. మంచో చెడో వెటజ్ ఇన్వైట్ ది సిట్యుయేషన్ అన్న నిర్ణయానికొచ్చాడు.

"అల్ రైట్. డూ ఏజ్ షి లైక్స్" అన్నాడు.

"మే గాడ్ బ్లెస్ ఓన్ ట్రయల్" అని గేబ్రియల్ వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడే కరుణ హాస్పిటల్లో ఎడ్మిట్ అయింది.

ఆ సాయంకాలం కరుణ బెడ్ పక్కన కూర్చున్న సుందరం "ఇంకో పదిహేను రోజులగ్గాని ఆపరేషను చెయ్యడానికి వీలవదంటున్నారు. పనిమనిషుంటుంది. నీకేం కావల్సినా చూడ్డానికి మూర్తి వున్నాడు. నేఁ వెళ్ళిపోతాను కరుణా... నీకు కళ్ళొచ్చాయని తెల్సిన మరుక్షణం బయలుదేరి వస్తాను..." అన్నాడు ఎలా గయినా సరే ఈ సిట్యుయేషన్ని ఎవాయిడ్ చేద్దామని.

మళ్ళీ మొదలెట్టావా. పదండి బాబూ ఇద్దరం కలిసే వెళ్ళిపోదాం" అంది మూతి ముడిచి.

"అదికాదు కరుణా" ఇంకా ఏదో అనబోతున్న సుందరాన్ని వెనక నించున్న కృష్ణమూర్తి మాట్లాడనియ్యలేదు.

"నోర్మూయ్‌రా ఫూల్. పెళ్ళాన్ని హాస్పిటల్‌కి అప్పచెప్పేసి వెళ్ళిపోతాట్ట వెళ్ళిపోతాడు. వెళ్ళి నువు చక్కబెట్టాల్సిన రాచకార్యాలేం లేవుగాని ఈ నాల్రోజులూ యిక్కడేవుండు. ఏం మా యింట్లో నీ మర్యాదకేంలోటు జరుగుతోందేవిటి?" అన్నాడు మూర్తి.

"ఛ ఛ అదేం కాదురా నువ్వున్నావు కదా అన్నీ చూసుకోటానికి... పెద్ద నా అవసరమేవుంటుందనీ..." గొణిగాడు సుందరం.

"ఇలాంటి సమయాల్లో నువ్వు పక్కనుంటే ఆమెకు ఎంతో ధైర్యంగా వుంటుంది" అన్నాడు మూర్తి

ఇంక తప్పదు! జరగబోయే విపరీతానికి తట్టుకు నిలబడగలిగే ధైర్యాన్ని సమకూర్చుకుంటూ రోజులు లెక్కపెట్టుకుంటూ కూర్చోవాల్సిందే.

* * *

హాస్పిటల్లో స్పెషల్ వార్డు నానుకుని వున్న ఎటెండెంటు రూములో కిటికీ దగ్గిర నిలబడి తదేకంగా ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు సుందరం

కరుణకి రెండురోజులక్రితమే ఆపరేషను జరిగింది. ఈ రోజు ఆమెకు కట్టు విప్పుతారు. ఇంకో గంటలోనో అరగంటలోనో కరుణ కళ్ళు తెరుస్తుంది.

కట్లు విప్పగానే ఆమె కళ్ళల్లోకి ఒక్కసారిగా వచ్చే కాంతిని చూడ్డానికి రెండుకళ్లు చాల్తాయా?

కళ్లుతెరచి ఆమె తనని చూసే మొట్టమొదటి చూపుకి ఆమె కళ్లల్లో నిండే చిట్టచీకటి చూసి సహించటానికి అనంతకోటి నేత్రాలు చాల్తాయా?

ఎంతో సుందరమైనది ఈ ప్రపంచం అని చీకటిలో ఇంతవరకూ ఊహించిన ఆమె మధుర ఆశాలతలు ఆమె తొలి చూపులోనే వేళ్ళతోసహా పెకలి చెల్లా చెదురయిపోతాయా?

ఆ క్షణంలో ఆమె కళ్ళల్లో పొంగి పొరలే కన్నీటి ప్రవాహానికి ఎవరు ఆనకట్ట కట్టగలరు?

దగా... మోసం... వికృతం... భీబత్సం... ఇవి చూడ్డానికే ఆమె కళ్ల తెరవబోతోందా?

ఆ చూపులోంచి ఒక్కసారిగా వెలికి వచ్చే అసహ్యం... జుగుప్స భరించటానికి ఎన్ని గుండెలు చాల్తాయి?

"భగవాన్ జీవితంలో ఏ వ్యక్తికి ఇంత భయంకరమయిన క్షణాన్ని ప్రసాదించకు మనసంటూ మిగిలివున్న ఏ మనిషీ ఇంత దారుణమయిన పరిస్థితిని తట్టుకోలేడు!" కిటికీలోంచి దూరంగా కనిపిస్తున్న ఆలయంవేపు చూస్తూ మనసులో అనుకున్నాడు సుందరం.

స్ట్రెచ్చరు చక్రాలచప్పుడు దగ్గిరవుతోంది. కట్లువిప్పిన కరుణని తన దగ్గిరకు తీసుకొస్తున్నారు

"ఏరీ ఆయనెక్కడా? మూర్తిగారూ నాకు కళ్లు వచ్చేయా? నేనిప్పుడు కళ్ల తెరచి అన్నీ చూడగలనా? అన్నిటికంటే ముందు ఆయన్ని చూడాలి నేను.. ప్లీజ్ మూర్తిగారూ ఆయన్ని దయచేసి పిలవండి... ఎక్కడున్నారు ఆయన? ఆయన్ని నా ఎదురుగా నించోమనండి" కరుణమాటలు వినిపిస్తున్నాయి.

"అనంతమైన కాంతికిరణాల్ని తన కళ్లల్లో పెట్టుకుని వచ్చేస్తూంది కరుణ. అంత వెలుగు ఒక్కసారి తన కళ్ళల్లోకి... భరించలేను భగవాన్ భరించలేను పుట్టిందగ్గిర్నుంచి ఈ ప్రపంచం అంతా ఏకమయి నన్ను చూసి అసహ్యించుకున్నా భరించి... ఎదిరించి బ్రతగ్గలిగాను... కాని ఈ సన్నివేశాన్ని మాత్రం భరించి బ్రతకగలిగే ధైర్యం నాకులేదు. ఆ వొక్క ఆమె చూపు తప్పించుకునే మార్గం చూపించు.. మృత్యువుకన్నా భయంకరమైన ఆక్షణం వచ్చేస్తూంది" సుందరం అస్పష్టంగా గొణుగుతున్నాడు.

"ఏం ఆయన ఇక్కడే వున్నారు కరుణా...ఆయన్నే మీరు మొట్టమొదట చూద్దురుగాని. మీరలా ఆవేశపడకూడదు... ఒక్కసారిగా కళ్ళు తెరవకూడదు... జాగ్రత్తగా కళ్ళు తెరవండి... వెరీస్లో... చిన్నవెలుగు అవుపడ్తోంది కదూ" మూర్తి ఆమెను ప్రిపేర్ చేస్తున్నాడు.

"అవును...తెల్లగా అవుపిస్తోంది... ఏవిటది... ముద్దముద్దగా కనిపిస్తోంది.. అబ్బ! కళ్ళు మండుతున్నాయి" కరుణ అరుస్తోంది.

"పర్వాలేదు... ఇదిగో మందు వేస్తున్నాను...ఇప్పుడు తెరవండి...డోంట్ ఎక్సైటె యువర్ సెల్ఫ్ప్లీజ్... మెల్లగా స్లోలీ... ఎస్ చూడండి...మరి కొంచెం రెప్పలు విప్పండి... వెరీగుడ్... బాగా కళ్ళుతెరవండి డోంట్ కాన్సంట్రేట్..

ఒక్కసారి కళ్ళుమూసి మళ్ళీ తెరవండి. స్లోగా...వెరీ స్లో... ఇప్పుడు అలుక్కుపోయినట్లు లేదు కదూ" మూర్తి మాటలు దగ్గరగా వినిపిస్తున్నాయి.

"అవును...కనపడుతోంది...చాలా వెలుగ్గావుంది... అదేవిటి దీపం... బల్బుకదూ... దానిచుట్టూ ఏవిటి... ఏవిటది... నల్లగా కనిపిస్తోంది... షేడ్... కదూ... మూర్తిగారూ కనిపిస్తోంది... పూర్తిగా కనిపిస్తోంది...కళ్లు మండటంలేదు... కరుణ సంతోషంగా అంటోంది.

ఏ దేవుడు కరుణించాడో... కరుణకి చూపు వచ్చింది!

"సక్సెస్! సుందరం...సుందరం. హొరేయి ఎక్కడరా... నీ భార్యకి కళ్ళొచ్చాయిరా ఫూల్...నే చెప్పలేదూ.. ఇప్పుడు చూడు నీ భార్యని" కరుణనితీసుకుని సుందరం నిలబడ్డ గదిలోకొచ్చాడు మూర్తి. అటుతిరిగి నిలబడివున్న సుందరాన్ని చూసి చిన్నగా నవ్వుకున్నాడు

"కరుణా ఇదిగోనమ్మా మీ ఆయన కళ్ళుతెరిచి చూడు... నీ ఎదురుగుండా వున్నాడు... కాని అటుతిరిగి ఎటో శూన్యంలోకి చూస్తున్నాడు... ఇటు తిరగరా ఫూల్... నీ భార్య కళ్ళల్లోకి ఒక్కసారి చూడు. కళ్ళొచ్చిన మొట్ట మొదటిక్షణంలో నిన్నే చూడాలని పరిగెత్తుకువచ్చిన ఆమె మొట్టమొదటి చూపు పొందగలిగే అదృష్టాన్ని పొందరా ఫూల్..." అంటున్న మూర్తికి చటున ఏదో గుర్తొచ్చి "అయామ్ సారీరా...ఈ క్షణంలో మీ యిద్దరిమధ్యా.. ఆ మాట చెప్పకూడదురా. ఫూల్ ఆడపిల్లలా సిగ్గుపడి అటు తిరక్కపోతే..." అంటూ వెళ్ళిపోయాడు మూర్తి.

"ఏవండీ నేనింకా కళ్ళు మూసుకునే ఉన్నాను... ఇటు తిరిగారా లేదా? మిమ్మల్ని చూడకుండా ముందుగా ఏదీ చూడలేను... మీ మాట కాదని ఈ ఆపరేషను చేయించుకున్నానని ఇంకా నామీద కోపంవేనా... ఏదో ప్రమాదం జరిగిపోతుందని ఊరికే ఊహించుకుని భయపడిపోయారు... వొట్టి పిచ్చివారండీ మీరు... అయినా నాకు కళ్లు వచ్చేసాయిగా...ఏవిటి మాట్లాడరేంవిటి.. ఇంతకీ ఇటు తిరిగారా లేదా... నేను కళ్లు విప్పేస్తున్నాను... మీ చూపూ నా చూపూ ఒక్కక్షణం కలుసుకోవాలి.. తిరిగారు కదూ... చూస్తున్నారుకదూ" కళ్లు తెరవబోతూ అంది కరుణ.

"చూడలేను కరుణా చూడలేను" అంటూ సుందరం ఆమెవేపు తిరిగాడు.

ఆమె కళ్లుతెరచి ఎదురుగా వున్న అతని మొహంలోకి చూసింది. అంతే! ఒక్కసారి కెవ్వుమని అరిచింది ఆ దృశ్యాన్ని చూసి!

రక్తసిక్తాలయి మొహంనుంచి వ్రేళ్లాడుతున్న కనుగుడ్లు! ఎర్రగా రక్తంలో తడిసి ముద్దయిపోయిన భయంకరమైన మొహం!

అంత దారుణ దృశ్యానికి కారణమయి నిల్చున్న పదునైన కిటికీచువ్వలు రెండు చెరో రక్తపు బొట్టూ విడవడానికి సిద్ధంగా వున్నయి!

---